ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 259 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 25 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


## వందేభారత్‌లో స్లీపర్ కోచ్
# ట్రయల్ రన్ విజయవంతం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని కజురహో–ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్ రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చైన్నై ఐసీఎఫ్ నుంచి కజురహో చేరిన వందేభారత్ స్లీపర్ రైలు.. శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరుకున్నది. మరుసటి రోజు కజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది. ఎస్ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే టెక్నికల్ టీమ్‌తోపాటు, ఐసీఎప్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కజురహోకు వెళ్తున్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు.. తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది. ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. కాగా ఈ రైలు వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ రైల్వే భావిస్తున్నది. దీనికోసం పది రైళ్లను సిద్ధం చేస్తున్నది. వందే భారత్ స్లీపర్ రైలుకు చాలానే ప్రత్యేకలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులు ఈ రైలులో సౌకర్యాలుంటాయి. ఈ రైలు ముందు విలాసవంతమైన హోటల్స్ సైతం దిగదుడుపేనని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్నది. వందే భారత్ స్లీపర్ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణికులు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి.

**గంటకు 160 కిలోమీటర్ల వేగంతో..**

ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దాంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనున్నది. రైలులో ఫైర్ సేఫ్టీతో పాటు ప్రతి బెర్త్ వద్ద అత్యవసర స్టాప్ బటన్స్ సైతం ఉంటాయి. ప్రయాణికులు సౌకర్యవంతంగా

..మిగతా 2లో



## ముగిసిన అల్లు అర్జున్ విచారణ

### తండ్రి అరవింద్‌తో కలసి హాజరు
### అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ రికార్డు
### మళ్లీ పిలిస్తే అందుబాటులో ఉండాలన్న పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్ విచారణ ముగిసింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై మూడు గంటలు పాటు విచారణ చేసిన పోలీసులు.. అల్లు అర్జున్‌ను 20 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని.. అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు పోలీసులు తెలిపారు. పోలీసులు సేకరించిన వీడియోలు, సిసి ఫుటేజ్‌ను ముందు పెట్టి

..మిగతా 2లో

## సంధ్య థియేటర్ ఘటన యాదృచ్ఛికం

### ఎవరూ కావాలని ఇలాంటి ఘటనను కోరుకోరు
పరిశ్రమకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటా
సిఎం రేవంత్‌తో కలసి అన్ని విషయాలు చర్చిస్తా
రేవతి కుటుంబానికి అండగా నిలబడతాం
కిమ్స్‌లో శ్రీతేజ్‌ను పరామర్శించిన దిల్ రాజు
అర్జున్‌పై కేసు సరికాదన్న రేవతి భర్త భాస్కర్

2



## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను తొలగించాలి

### ఖమ్మం నిరసన కార్యక్రమంలో భట్టి డిమాండ్

**ఖమ్మం, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** అంబేద్కర్ అవమానించిన, ఈ దేశ రాజ్యాంగాన్ని అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోనూ అమిత్ షా వాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నిరసన ర్యాలీ నిర్వహించింది. నిరసన ర్యాలీలో రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయన్నారు. నిండు సభలో ఈ దేశ రాజ్యాంగాన్ని దేశానికి మార్గదర్శకులుగా నిలిచిన అంబేద్కర్‌ను అవమానించిన అమిషాపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలో భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్నదంటే అందుకు ఈ దేశ రాజ్యాంగమే ప్రధాన కారణమని చెప్పుకొచ్చారు. అంబేద్కర్ వంటి మహనీయులు.. ఈ దేశంలో ప్రతి ఒక్క పౌరుడు గర్వంగా తిరిగేలా స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కుల

..మిగతా 2లో




## హైకోర్టులో కేసీఆర్, హరీష్ రావులకు ఊరట

### మేడిగడ్డపై భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులు కొట్టివేత
### విచారణ జనవరి 7కు వాయిదా




**హైదరాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో ఊరట లభించింది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు జారీ చేసిన నోటీసులను సస్పెండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భూపాలపల్లి కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు సరైనవి కావని హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఫిర్యాదుదారుడు నాగవెల్లి లింగమూర్తికి నోటీసులు జారీ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కూలిన ఘటనపై భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగా.. తాజాగా ఆ నోటీసులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసు తదుపరి విచారణను ధర్మాసనం జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడానికి ప్రధాన కారణం కేసీఆర్, హరీశ్ రావు, తదితరులని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి మెజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ అంశం తమ పరిధిలోకి రాదని మేజిస్ట్రేట్ కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాజలింగమూర్తి జిల్లా

..మిగతా 2లో

## సెకనుకు రెండు బిర్యానీలు

### 97 లక్షలకు పైగా ఆర్డర్ చేసిన హైదరాబాదీలు




**హైదరాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** అది పార్టీ అయినా.. సందర్భం ఏదైనా అందరికీ మొదట గుర్తుకు వచ్చేది బిర్యానియే. ఈ వంటకం భారతీయులకు ఇష్టమైన ఎంపికగా నిలిచింది. ఈ క్రమంలో ఆన్‌లైఫుడ్ ఫుడ్ డెలివరీ రంగంలోనే బిర్యానీనే టాప్ ప్లేస్‌లో నిలుస్తూ వస్తున్నది. తాజాగా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది స్విగ్గి. వరుసగా తొమ్మిదో సంవత్సరం ఆన్‌లైన్ ఆర్డర్లలో బిర్యానీ అగ్రస్థానంలో నిలిచి.. భారతీయులకు ప్రియమైన వంటకంగా నిలిచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 22 వరకు 8.3 కోట్ల బిర్యానీలు ఆర్డర్ చేయగా.. ప్రతి నిమిషానికి 158 బిర్యానీలు, సెకనుకు రెండు బిర్యానీలు ఆర్డర్ చేశారు. దీని తర్వాత, దోస 2.3 కోట్ల ఆర్డర్లతో రెండవ స్థానంలో నిలిచింది. స్విగ్గి 'ఫుడ్ ట్రెండ్ రిపోర్ట్' ప్రకారం.. బిర్యానీ వరుసగా తొమ్మిదవ సంవత్సరం అత్యధికంగా ఆర్డర్లు సాధించింది. 4.9లక్షల చికెన్ బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్లుగా పేర్కొంది. ఇందులో హైదరాబాదీలు అత్యధికంగా చికెన్ బిర్యానీని 97 లక్షలకుపైగా ఆర్డర్ చేశారు. ఆ తర్వాత 77 లక్షల ఆర్డర్లతో బెంగళూరు రెండో స్థానంలో, 46 లక్షల ఆర్డర్లతో చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. రాత్రి సమయంలో ఎక్కువగా తిన్న ఫుడ్‌లలో చికెన్ బర్గర్

..మిగతా 2లో

## 8న వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై తొలిసారి సమావేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ వచ్చే నెల 8న తొలిసారి సమావేశం కానుంది. కమిటీ ఛైరపర్సన్‌తోపాటు సభ్యులు అంతా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేవం అజెండాకు సంబంధించిన వివరాలను కేంద్ర న్యాయ శాఖ కమిటీ సభ్యులకు తెలియజేయనుంది. జనవరి 8న ఉదయం 11 గంటలకు సమావేశం మొదలుకానుంది. ఈ విషయాన్ని కమిటీ జాయింట్ సెక్రెటరీ

..మిగతా 2లో





# పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

జిల్లా సిపిఐ కార్యాలయము రాజేంద్రనగర్ ఏ ఆర్ దేవరాజ్ భవన్ 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ గోడ పత్రికను పత్రికను ఆవిష్కరించిన ఆవిష్కరించిన జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగినది ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ అలనాటి పెద్దలు భారతదేశంలో అలుపెరుగని భారతదేశంలో అలుపెరుగని పోరాట యోధుడిగా ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ నిలిచింది అనేక పోరాటాలు త్యాగాలు అనేక పోరాటాలు త్యాగాలు దేశ ప్రజల కోసం వారి రక్షణ కోసం చట్టాలను తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించినటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ భారత కాంగ్రెస్ పార్టీ అని అన్నారు ఈ నెల 30న 100 సంవత్సరాల ఉత్సవాల సభ నల్గొండలో నల్లగొండలో రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో కావున విజయవంతం చేయవలసిందిగా పార్టీ శ్రేణులకు ఇంకా ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి విజయ్ ఆనంద్ గౌడ్ బీసీ సంఘం జిల్లా నాయకులు సదానంద గౌడ్ జిల్లా సమితి సభ్యులు జి ఆనంద్ గౌడ్ సీనియర్ జిల్లా నాయకులు జి సత్యనారాయణ సీనియర్ నాయకులు కళ్లెం లక్ష్మయ్య ఏఐటీసీ పార్టీ సీనియర్ నాయకులు బండి నరసింహ కృష్ణ ఇంటిపేరు సీపీఐ నాయకులు మద్దూరి కృష్ణ పద్మ మహిళా నాయకురాలు శాలిని శాంతమ్మ పాల్గొన్నారు .

# వందేభారత్‌లో స్లీపర్ కోచ్ ట్రయల్ రన్ విజయవంతం

మొదటి పేజీ తరువాయి...

ప్రయాణించేందుకు బెర్తులను మెరుగైన కుషన్‌తో ఏర్పాటు చేశారు. అప్పర్ బెర్తులు ఎక్కేలా మెట్లు ఏర్పాటు చేశారు. దాంతో ప్రయాణికులకు సరికొత్త అనుభవాన్ని అందించనున్నాయి. అలాగే, రైలులో అత్యాధునిక సేవలు అందించనున్నారు. బయో వాక్యూమ్ టాయిలెట్లు, టచ్ ఫ్రీ ఫిట్టింగ్‌లు, షవర్ క్యూబికల్స్, ఆటోమేటిక్ డోర్లు, జీపీఎస్ ఆధారిత డిస్‌ప్లేలు, ఛార్జింగ్ సాకెట్లు వంటి సౌకర్యాలు ఈ మరింత ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నది. రైలులో ఆటోమేటెడ్ డోర్లు ఏర్పాటు చేశారు. టాయిలెట్‌లో ఎలాంటి బయటన్ నొక్కకుండానే నీళ్లు వస్తాయి. ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి వెళ్లేందుకు ఆటో మేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కోచ్‌లో ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ సైతం ఉ ంటుంది.

**పతి కోచ్‌లో సీసీ కెమెరాలు..**

ప్రతి కోచ్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. చార్జింగ్ పెట్టుకునేందుకు ప్రతి బెర్త్ వద్ద సాకెట్ ఉంటుంది. అలాగే, బెర్త్ వద్ద చిన్న లైట్ సైతం ఉంటుంది. దాంతో ఎవరైనా బుక్‌లు, పేపర్ చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. సేఫ్టీ 'కవచ్' సిస్టమ్, బ్లాట్ ప్రూఫ్ బ్యాటరీ, 3 గంటల ఎమర్జెన్సీ బ్యాకప్ ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తాయని రైల్వేశాఖ పేర్కొంది. అయితే, వందే భారత్ తొలి రైలు ట్రయల్ రన్ మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో జరుగనున్నది తెలుస్తున్నది. రైల్వే డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ట్రయల్ జరుగనున్నది. రైలు స్థిరత్వం, వైబ్రేషన్, డైనమిక్ పనితీరును ట్రయల్స్‌లో అంచనా వేయనున్నారు.

# హైకోర్టులో కేసీఆర్, హరీష్ రావులకు ఊరట

మొదటి పేజీ తరువాయి...

కోర్టును ఆశ్రయించి రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన భూపాలపల్లి జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్ రావు, తదితరులకు నోటీసులు జారీ చేసింది. కాగా.. రివిజన్ పిటిషన్‌ను స్వీకరించే అధికారం భూపాలపల్లి జిల్లా కోర్టుకు లేదని వారు హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం భూపాలపల్లి జిల్లా కోర్టు జారీ చేసిన నోటీసులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. పిటిషన్‌ను విచారించిన భూపాల్లి కోర్టు.. కేసీఆర్‌తో పాటు అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీష్‌రావు, అలాగే బీఆర్ఎస్ హయాంలో పనిచేసిన నీటిపారుదల శాఖ అధికారులకు జూలై 10న నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 5న కోర్టుకు హాజరుకావాలంటూ కేసీఆర్, హరీష్ రావులను భూపాలపల్లి కోర్టు ఆదేశించింది.అయితే భూపాలపల్లి కోర్టు ఇచ్చిన ఆదేశాలపై కేసీఆర్, హరీష్‌రావులు హైకోర్టును ఆశ్రయించారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలంటూ హైకోర్టు ధర్మాసనాన్ని కోరారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేసీఆర్, హరీష్‌రావు వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులను సస్పెండ్ చేయడంతో పాటు ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేశారు. అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది.

# సెకనుకు రెండు బిర్యానీలు

మొదటి పేజీ తరువాయి...

నిలిచింది. రాత్రి 12 నుంచి 2 గంటల మధ్య 18.4లక్షల చికెన్ బర్గర్ ఆర్డర్లు వచ్చాయని స్విగ్గీ రిపోర్ట్ పేర్కొంది. ఇక మసాలా దోసలో బెంగళూరు ఆదిపత్యాన్ని కొనసాగించింది. బెంగళూరు వాసులు జనవరి ఒకటి నుంచి నవంబర్ 22 మధ్య 25లక్షల దోసెలను ఆర్డర్ చేశారు. ఢిల్లీ, చండీగఢ్, కోల్‌కతాలో చోలే, ఆలూ పరాఠా, కచోరీలకు ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. ఇక బెంగళూరుకు చెందిన ఓ స్విగ్గీ యూజర్ ఏకంగా ఏడాదిలో పాస్తా కోసం రూ.49,900 వెచ్చించాడు. దాదాపు 55 ఫెటుక్సిన్ ఆల్ఫ్రెడో, 40 మాక్, చీజ్.. 30 స్పఘెట్టి కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ఏడాది లంచ్ కోసం కంటే డిన్నర్‌కి 29శాతం ఎక్కువగా 21.5 కోట్లు ఆర్డర్లు వచ్చాయి. 24.8 లక్షల ఆర్డర్‌లతో చికెన్ రోల్ అత్యంత ఇష్టపడే స్నాక్‌గా నిలిచింది. 16.3 లక్షల ఆర్డర్లతో చికెన్ మోమోస్ రెండో స్థానంలో, 13 లక్షల ఆర్డర్లతో పొటాటో ఫ్రైస్ మూడో స్థానంలో నిలిచాయి. నివేదిక ప్రకారం, డెలివరీ బాయ్స్ మొత్తం 1.96 బిలియన్ కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ లెక్కన కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు 5.33లక్షల సార్లు ప్రయాణించడంతో సమానమని పేర్కొన్నారు. ముంబయికి చెందిన కపిల్ కుమార్ పాండే అత్యధికంగా 10,703 ఆర్డర్‌లను డెలివరీ చేశారు. కోయంబత్తూరుకు చెందిన కాళీశ్వరి ఎం మహిళ 6,658 ఆర్డర్‌లను డెలివరీ చేసి అగ్రస్థానంలో నిలిచినట్లు నివేదిక పేర్కొంది.

# వీసా లేకున్నా మలేషియా టూర్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** భారతీయులు మరో రెండేళ్ల వరకూ వీసా లేకున్నా మలేషియాకు వెళ్లవచ్చు. 2026 డిసెంబర్ 31 వరకూ వీసా లేకుండా తమ దేశంలో 30 రోజులు పర్యటించవచ్చని అక్కడి ప్రభుత్వం తెలిపింది. 2025 ఏషియన్ చాంపియన్ షిప్ చైర్మన్ షిప్ మలేషియాకు రానున్నది. ఈ నేపథ్యంలో మలేషియాలో పర్యటనకు ఏర్పాట్లు చేసుకోవచ్చునని మలేషియా హోంశాఖ సెక్రటరీ జనరల్ దాటుక్ అవాంగ్ అల్లిక్ జెమాన్ తెలిపారు. పర్యాటక రంగం విస్తరణ, ఆర్థిక వఅద్ధి ఉద్దీపనకు తొలుత 2023 లో మలేషియా వీసా మినహాయింపు పక్రియ ప్రారంభించింది. చైనా పౌరులకు కూడా వీసా మినహాయింపునిచ్చింది మలేషియా పర్యాటక రంగానికి భారత ప్రయానికులు చాలా కీలకం.

# సంధ్య థియేటర్ ఘటన యాదృచ్ఛికం

**హైదరాబాద్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** సంధ్య థియేటర్ ఘటన ఎవరూ కావాలని చేసింది కాదని, అది ప్రమాదవశాత్తు జరిగిందని ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు అన్నారు. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం దూరం పెడుతోందనేది దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. చిత్రపరిశ్రమకు అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం రేవతం÷- రెడ్డి ఇప్పటికే అన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. త్వరలోనే సినీ పరిశ్రమ ప్రతినిధులం వెళ్లి సీఎంను కలుస్తామని అన్నారు.. ఎలాంటి సమస్యలు రాకుండా చూసే బాధ్యత నాపై ఉంది' అని దిల్ రాజు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టంభన రాకుండా చూస్తానని అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి అండగా ఉంటామని కూడా దిల్ రాజు ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను నిర్మాత దిల్ రాజు మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. సీఎం రేవంత్ రెడ్డి నన్ను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించారు. నేను అమెరికాలో ఉ న్నందున ఇన్ని రోజులు రాలేకపోయా. అమెరికా నుంచి రాగానే ముఖ్యమంత్రిని కలిశా. అల్లు అర్జున్‌ను త్వరలోనే కలుస్తా. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తున్నా. దానికి త్వరలోనే ఫుల్‌స్టాప్ పెడదాం. సినీ పరిశ్రమ వారితోపాటు ప్రభుత్వ పెద్దలను త్వరలోనే కలిసి షరిష్కారం చూపే ప్రయత్నం చేస్తా. చిత్ర పరిశ్రమ, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటా. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం. రేవతి భర్త భాస్కర్‌కు ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి మెరుగవుతోంది. మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారని వివరించారు. నిర్మాతతో తోపాటు డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి బాలుడిని పరామర్శించారు. శ్రీతేజ్ రికవరీ అవుతున్నాడని తెలిపాడు. రేవతి మరణం పట్ల బాధను వ్యక్త పరిచారు. కావాలని ఎవరు ఇలాంటి ఘటనలకు పాల్పడరని తెలిపారు. అలాగే రేవతి కుటుంబం కూడా వినోదం కోసమే థియేటర్‌కు వెళ్లారని అన్నారు. రేపు లేదా ఎల్లుండి సీఎం రేవంత్‌ను కలుస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు ఛైర్మన్‌గా బాధ్యత తీసుకుంటా అని అన్నారు. ఇటీవల తెలుగు సినిమా పరిశ్రమను మరింత పెద్దదిగా చేయటమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ఆలోచనలు ఉన్నాయని దిల్ రాజు చెప్పుకొచ్చారు. నిజానికి 2014లోనే టాలీవుడ్ అభివృద్ధికి భూములు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా.. దశాబ్ద కాలంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కానీ గతేడాది సీఎం రేవంత్ రాకతో ఆగిపోయిన నంది అవార్డులను గద్దర్ అవార్డుల పేరుతో తిరిగి ప్రారంభిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నుంచి గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందని.. కమిటీతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని ఈ సందర్భంగా దిల్ రాజు ప్రకటించారు. ఇదిలావుంటే సంధ్య థియేటర్ తొక్కిసలాట బాధితుడు శ్రీతేజ్ తండ్రి భాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం శ్రీతేజ్ కోలుకుంటున్నాడని... ఇప్పుడిప్పుడే ట్రీట్మెంట్ కి పాజిటివ్ గా రెస్పాండ్ అవుతున్నాడని, కళ్ళు తెరచి చూస్తున్నాడని అన్నారు. తమ వల్ల అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడం ఇష్టం లేదని.. అల్లు అర్జున్ పై పెట్టిన కేసు వాపసు తీసుకుంటానని అన్నారు. ప్రభుత్వం నుండి కోమటిరెడ్డి హామీ ఇచ్చారని.. అల్లు అర్జున్ రూ. 25లక్షలు ప్రకటించారని.. ఇప్పటికి రూ. 10లక్షలు ఇచ్చారని అన్నారు. మైత్రి మూవీస్ వారు రూ. 50లక్షలు ఇచ్చారని.. సుకుమార్ ఫ్యామిలీ కూడా అండగా ఉందని అన్నారు. ఇదిలా ఉండగా.. హాస్పిటల్ కి వెళ్లి శ్రీతేజ్ కుటుంబాన్ని పరామర్శించిన నిర్మాత దిల్ రాజు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఇదిలా ఉండగా.. సంధ్య థియేటర్ ఘటన రిమాండ్ రిపోర్టులో నిందితుల లిస్ట్ ను పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో అల్లు అర్జున్ ను ఏ11 గా చేర్చిన పోలీసులు.. ఏ 18గా పుష్ప నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ నిర్మాతను చేర్చారు. ఏ1 నుంచి ఏ8 వరకు థియేటర్ యజమానులు, మేనజర్ ను చేర్చారు. ఏ9 ,ఏ 10 గా సంధ్య థియేటర్ సెక్యూరిటీ, మేనేజర్ ను చేర్చారు.

# ముగిసిన అల్లు అర్జున్ విచారణ

మొదటి పేజీ తరువాయి...

అల్లు అర్జున్‌ను విచారించారు. ఇదిలాఉండగా.. అల్లు అర్జున్‌కు కోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు కోరనున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడారని.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులో బెయిల్ రద్దు చేయాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, విచారణ అనంతరం అల్లు అర్జున్ చిక్కడపల్లి పీఎస్ నుంచి జూబ్లీహిల్స్ నివాసానికి బయలుదేరారు. ఎస్కార్ట్ వాహనంతో చిక్కడపల్లి పీఎస్ నుంచి తన ఇంటికి వెళ్లారు.సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ మంగళవారం ఉదయం 11 గంటలకు తన తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అల్లు అర్జున్ లాయర్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసు కూడా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ విచారణలో అల్లు అర్జున్‌ను మధ్యాహ్నం 2.47 గంటల వరకు విచారించారు. ఈ విచారణలో ఏసీపీ రమేష్ కుమార్ కీలకంగా వ్యవహరించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన జరిగినపుడు రమేష్ కుమార్ కుమార్ అక్కడే ఉన్నారు. చిక్కడపల్లి డివిజన్‌కు సంబంధించి ఎల్ రమేష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ రమేష్ కుమార్ పరిధిలోకి వస్తాయి. ఘటన జరిగిన సమయంలో స్పాట్‌లోనే ఉండడంతో రమేష్ కుమార్ ఈ విచారణలో కీలకంగా మారారు. అసలు ఈ రోజు థియేటర్‌లో ఏం జరిగిందో ఆదివారం ఆయన కళ్లకు కట్టినట్టు వివరించారు. ఘటన జరిగిన రోజు తామంతా సంధ్య థియేటర్ దగ్గరే ఉన్నామని, రేవతి చనిపోయిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పడానికి వెళితే అతడి మేనేజర్ అడ్డుకున్నాడని తెలిపారు. డీసీపీ ఆదేశాల మేరకు తాను అల్లు అర్జున్ దగ్గరకు కష్టపడి చేరుకుని విషయం చెప్పానని, ఇంటికి వెళ్లిపోవాల్సిందిగా విజ్ఞప్తి చేశానని, అయితే సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ తనకు చెప్పారని ప్రెస్‌మీట్‌లో రమేష్ వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు అర్జున్ కేసు విషయంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ.. ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాదు.. హీరో అల్లు అర్జున్ వెను ఓ మహా శక్తి ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే అల్లు అర్జున్ కేసు వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లోనే గాక.. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. సమసిపోయిందనుకున్న వ్యవహారం.. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించడం, ఆ వెంటనే అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టడంతో మరింత రచ్చ క్రియేట్ అయ్యింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాడు చిక్కడపల్లి పోలీసులు.. హీరో అల్లు అర్జున్‌ను పీఎస్‌కు పిలిచి మరీ విచారించారు. పుష్ప సినిమాలో చేసినట్లుగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను కుప్ప కూల్చాలని చూస్తున్నట్లు తెలిపారు. గడిచిన 24 గంటలుగా పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. అల్లు అర్జున వెనుక ఓ శక్తి ఉందన్నారు. రేపటి నుంచి వారం రోజుల్లో రేవంత్ సర్కార్‌ను కూల్చడానికి పెద్ద ప్లాన్ వేశారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఈ వారం రోజుల్లోనే బీఆర్ఎస్, బీజేపీలు తాము అనుకున్న పనిని చేయాలను కుంటున్నాయని ఆరోపిపంచారు. అల్లు అరవింద్ ఫ్యామిలీని కాపాడటానికి ప్రతిపక్షాలు ఉన్నాయని.. పక్క రాష్ట్రాల నుంచి సైతం అల్లు అర్జున్‌కు మద్దతిస్తున్నారని చెప్పుకొచ్చారు. కానీ, బాధిత కుటుంబానికి అండగా నిలబడాల్సింది తెలంగాణ సమాజమేనని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. వీరికి అండగా నిలిచిన వారే నిజమైన తెలంగాణ వాదులు అని పేర్కొన్నారు. సినిమా ఇండస్ట్రీ పక్షాన నిలబడిన వారు తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారంటూ అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు చేసినందుకు తనపై ఎలాంటి కేసులు పెట్టినా ఎదుర్కొంటానని ప్రకటించారు.

# దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాల నిర్వహణకు కమిటీ

## స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కోసం కేంద్రానికి వినతి

### భక్తులకు దర్శనం, వసతి సౌకర్యాల్లో ఇబ్బంది లేకుండా చర్యలు

### తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం ఏర్పాటుకు నిర్ణయం

### అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బంది

### కంచి పీఠం పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయింపు

### ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు

### తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు

### వివరాలు వెల్లడించిన టీటీడీ ఈవో శ్యామలరావు

**తిరుమల, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం):** తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.తిరుమలలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని, తగినంత సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు ఈవో చెప్పారు. తిరుమలకు వచ్చే భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్‌బ్యాక్‌ను ఏపీ డిజిటల్ సహకారంతో స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో ఉన్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తున్నామని అన్నారు. అన్నప్రసాదంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు ప్రకటించారు..కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుమలలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులు సౌకర్యార్థం క్యూ కాంప్లెక్స్ వద్ద రూ.3.6 కోట్లతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు



కలశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల..శారదా పీఠానికి కేటాయించిన మఠం లీజు రద్దు చేయడానికి నోటీసులు జారీ చేశామని అన్నారు. మఠం నిర్వాహకులు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తులకు అందించే సేవలపై, వారి సమస్యలను తెలుసుకునేందుకు ఫీడ్ బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుమలలో వున్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తామని తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని.. అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తామని టీటీడీ ఈవో తెలిపారు. మీడియా సమావేశంలో ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా పాల్గొన్నారు.



# ప్రపంచానికి ప్రేమ తత్వాన్ని బోధించిన మహానుభావుడు ఏసుక్రీస్తు

## ఆయన ప్రబోధించిన జీవిత సత్యాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

## తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం ప్రపంచానికి ప్రేమ తత్వాన్ని బోధించిన మహానుభావుడు ఏసుక్రీస్తు అని, ఆయన ప్రబుదించిన జీవిత సత్యాలను ప్రతి ఒక్కరు పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ అన్నారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ న్నువలే నీ పొరుగువారిని ప్రేమించు అంటూ బైబిల్ లో ఏసుక్రీస్తు చెప్పిన సందేశం ప్రతీ మనిషి పాటిస్తే ప్రపంచంలో వివాదాలు, యుద్ధాలే ఉండవని ఈ సందర్భంగా తెలిపారు. తప్పులకు క్షమాపణలు కోరడం.. బాధితులకు అండగా నిలవడమే క్రిస్మస్ చెప్పే సందేశమని అన్నారు. ప్రపంచానికి ప్రేమ, సేవ, కరుణ, త్యాగం, క్షమాగుణం... వంటి అద్భుతమైన జీవన మార్గాలను అం దించిన జీసస్ స్ఫూర్తిని కొనసాగించేందుకు మనమంతా ఒకరినొకరు గౌరవించుకుంటూ ఆదర్శవంతమైన సమా జాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఆ ఏసుక్రీస్తు దయతో తెలంగాణలో ప్రజలంతా పాడిపంటలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని గొల్ల జాన్ ప్రార్థించారు.

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను తొలగించాలి

మొదటి పేజీ తరువాయి...

మతాలకతీతంగా ప్రాంతాలకు అతీతంగా నేడు దేశంలో ప్రతి ఒక్క పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నారని.. ఇందుకు మన రాజ్యాంగమే ప్రధాన కారణమని చెప్పారు. ఈ హక్కులను కాల రాయాలని ఈ రాజ్యాంగాన్ని ఉల్లంఘించాలని భారతీయ జనతా పార్టీ ఎన్నో కుట్రలు కుతంత్రాలు చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపైన దేశ వ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ దేశానికి హోం మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

# 8న వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై తొలిసారి సమావేశం


మొదటి పేజీ తరువాయి...

గుండా శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా మీడియాకు వెల్లడించారు. 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయిం ట్ పార్లమెంటరీ కమిటీ వచ్చే జనవరి 9న తొలిసారి సమావేశం కానుందని, సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నేడు చర్చీలలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ ట్రీ వద్ద స్నేహా



రంగు రంగుల విద్యుత్ దీపాలతో బుద్వేల్ మెథడిస్ట్ చర్చ్



చిన్నారుల నృత్యాలు



క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారి దేవాన్ష్

బుద్వేల్, డిసెంబరు 24 (ప్రభాత ఉదయం): క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే క్రిస్మస్ వేడకలను ఘనంగా నిర్వహించకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లోని చర్చీలలో క్రిస్మస్ ట్రీ లు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో కనువిందు చేస్తున్నాయి. బుధవారం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చీలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు చర్చీలలో మంగళవారం రాత్రి క్రిస్మస్ ఈవ్ కార్యక్రమాలను నిర్వహించి యేసు క్రీస్తు పుట్టుకు గురించి నాటక ప్రదర్శనలు చేశారు.

### ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలు

ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను నిర్వహించడానికి చర్చీలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజేంద్రనగర్ మన్నా చర్చిలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, బుద్వేల్ బెథెస్థా మిషన్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ కె.నతానియేల్, కోనేటి ప్రార్థన మందిరంలో సిస్టర్ ఎస్. యేసుమణి, మెథడిస్ట్ చర్చిలో రెవరెండ్ అశోక్. రెవరెండ్ నతానియేల్, రెవరెండ్ ప్రణీత్ బాబు, రెవరెండ్ గుంటి డానియేల్, చింతల్ మెట్ నుంచి ఉప్పర్ పల్లి దారిలో గల రాక్ చర్చిలో రెవరెండ్ కె.సుందర్ పాల్, ఉప్పర్ పల్లి హెూరేబు చర్చిలో రెవరెండ్ పి.స్వర్ణకుమార్, హైదర్ గూడలోని అగాపే ప్రేయర్ టెం పుల్ లో పాస్టర్ సోమారం రాజకుమార్, అత్తాపూర్ లో రెవరెండ్ జేపీ పాల్, రెవరెండ్ సామ్యూల్ రాజు, రెవరెండ్ యేసురత్నం, శివరాంపల్లిలో పాస్టర్ బట్టు శ్రీకాంత్, పాస్టర్ ప్రమోద్, సిస్టర్ పద్మ ఇశ్రాయేల్, పాస్టర్ ప్రభాకర్, శాస్త్రీపురం లో రెవరెండ్ థామస్ కురియన్ దుర్గానగర్ లో రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ పాల్ దేవ రాజ్, లక్ష్మీగూడలో రెవరెండ్ జాన్ వెస్లీ, బాబుల్ రెడ్డినగర్ లో రెవరెండ్ డి.ఆనంద్ పాల్, మదుబనాకాలనీలో రెవరెండ్ కె.విజయకుమార్. ఉడంగడ్డలో సిస్టర్ పద్మ, పాస్టర్ కొర్నేలీ, ఆనంద నగర్ లో సిస్టర్ సీహెచ్ లీనా కుమారీ, పాస్టర్ దినకర్ ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### ప్రభుత్వ పరంగా పలు చర్చీలలో క్రిస్మస్ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చి, చింతల్మెట్ బెతెస్థా మిషన్ గాస్పెల్ చర్చి, ఉప్పర్ పల్లి రాక్ చర్చి, హైదర్ గూడ అగాపే ప్రేయర్ టెం పుల్, శాస్త్రీపురం కర్మేల్ ప్రార్థన మందిరం, దుర్గానగర్ షాలేమ్ ప్రేయర్ హౌజ్, ఆనంద్ నగర్ చర్చీలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

### క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు :

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉన్న క్రైస్తవులకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, కార్పొరేటర్లు పి.అర్చన జయప్రకాశ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, మోంద్ర సంగీత గౌరీశంకర్, అబేదా నవాజుద్దీన్, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



అనిల్ కుమార్‌ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

## అత్తాపూర్ డివిజన్ 201 బిజెపి బూత్ కమిటీ బూత్ అధ్యక్షులుగా పొట్ల అనిల్ కుమార్

రాజేంద్రనగర్, డిసెంబర్ 24(ప్రభాత ఉదయం) అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ లోని బూత్ నంబర్ 201 బీ. జే. పి. పోలింగ్ బూత్ కమిటీని శక్తి కేంద్రం ఇంచార్జ్ కవేలిగుడం బాలకృష్ణ ఆధ్వర్యంలో నియమించడం జరిగింది. బూత్ అధ్యక్షులుగా నియమితులైన పొట్ల అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ ను చేవెళ్ల పార్లమెంట్ బిజెపి కన్వీనర్ నారగుడం మల్లారెడ్డి శాలువతో సన్మానించి నూతన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్, లాభార్తి ప్రముఖ్ గా ఎర్ర రమేష్ బాబు, మన్ కీ బాత్ ప్రముఖ్ గా శ్రీనివాస్, వాట్సప్ గ్రూపు ప్రముఖ్ గా భాగ్య, బీ. ఎల్. ఏ గా ఎర్ర హరినాథ్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, అరుణ్, మహేందర్, పవన్, పద్మ, సుధా లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రావుల జగన్, డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పొట్ట గాయత్రి, కార్యకర్తలు బస్తీ వాసులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఈఓ

కేటిదొడ్డి, డిసెంబర్24(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను బోధిస్తున్న వాటిపై అడిగి తెలుసుకుని చదివించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతతో కూడిన బోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంటా కేజీబీవీ ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలకు, ప్రజా ప్రయోజనార్థం వినియోగించిన హౌసింగ్ బోర్డ్ స్థలంలో బోర్డులు పెట్టడం దారుణం

**అభివృద్ధి పనులకు ఆటంకాలు తలపెడితే సహించేది లేదు...**
**హౌసింగ్ బోర్డ్ అధికారులు పెట్టిన బోర్డులను వెంటనే తీసివేయాలి...**
**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...**

కూకట్‌పల్లి,డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలకు, ప్రజా ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన స్థలాన్ని హౌసింగ్ బోర్డ్ అధికారులు బోర్డులను ఏర్పాటు చేయడం దారుణమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కెపిహెచ్బి కాలని రమ్య గ్రౌండ్ వద్ద గత ప్రభుత్వంలో హౌసింగ్ బోర్డ్ భూములలో ప్రజా ప్రయోజనార్థం 10 శాతం స్థలాన్ని దేవాలయాలు, విద్య సంస్థలు, పార్కు ఏర్పాటుకు కేటాయించాలి. అందులో భాగంగానే ప్రభుత్వం పాఠశాల కొరకు స్థలాన్ని సేకరించి పాఠశాల పనులు జరుగుతుంటే హెూసింగ్ బోర్డ్ అధికారులు ఆ స్థలంలో ఎలా హౌసింగ్ బోర్డులు పెట్టతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయాలి తప్ప అభివృద్ధికి ఆటంకాలు జరిగేలా చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ప్రజా ప్రయోజనార్థం భాగంగానే గత ప్రభుత్వం స్థలాన్ని కేటాయెంచిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హౌసింగ్ బోర్డ్ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించాలని లేనిచో హౌసింగ్ బోర్డ్ కార్యాలయం వద్ద ధర్నా చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, గౌసుద్దిన్, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, గోపి, లక్ష్మిరాజు, లతా, రాము, వెంకట్ రెడ్డి , తులసి రెడ్డి ,కచ్చిన్, తదితరులు పాల్గొన్నారు.



## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 23 (ప్రభాత ఉదయం) ప్రతినిత్యం ప్రజలకు అందుబాటు లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు అన్నారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా వివిధ శుభకార్యాలు హాజరు కావాలని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పలు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



అప్పారెడ్డి గూడెం భీమయ్య

## రాజేంద్రనగర్ పట్టణ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

బుద్వేల్,డిసెంబరు24(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ పట్టణ ప్రజలకు, స్నేహితులకు, బంధువులకు, శ్రేయోభిలాషులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని యేసు ప్రభువును ప్రార్థిస్తున్నాను.



కె. రవి కుమార్

## సమగ్ర కుటుంబ సర్వే కంప్యూటరీకరణ పూర్తి

బుద్వేల్, డిసెంబరు24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో సమగ్ర కుటుంబ సర్వే వివరాల కంప్యూటరీకరణ పూర్తయిందని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. సర్కిల్ పరిధిలో 93,560 ఇండ్లు ఉన్నట్లు గుర్తించగా, మొదటగా 87,458 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయన్నారు. ఆ దరఖాస్తులన్నింటిని కంప్యూటరీకరణ చేయడం జరిగిందన్నారు. మిగతా వారిలో కొందరు వారి స్వగ్రామాలలో దరఖాస్తు చేసుకున్నారని, కొందరు సమగ్ర కుటుంబ సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఇష్టపడలేదన్నారు.

### రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు :

రాజేంద్రనగర్ సర్కిల్ లో నివసిస్తున్న క్రైస్తవులకు డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగను భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహిం చుకోవాలన్నారు.

## పుచ్చకాయలపై వివిధ బొమ్మలు



పుచ్చకాయపై యేసయ్యను ఎత్తుకున్న మరియ



పుచ్చ కాయపై క్రిస్మస్ తాత..



పుచ్చకాయపై క్రిస్మస్ ట్రీ



పుచ్చకాయలపై వివిధ రకాల బొమ్మలను గీసిన చెఫ్ రాజు

**బుద్వేల్, డిసెంబరు24 (ప్రభాత ఉదయం): క్రిస్మస్ సీజన్ కావడంతో రాజేంద్రనగర్ కు చెందిన చెఫ్ రాజు విద్యానగర్ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్ మెంట్ లో మంగళవారం పుచ్చకాయ పై క్రిస్మస్ తాత, క్రిస్మస్ ట్రీ, యేసు క్రీస్తు తల్లి మరియ. యేసయ్యను చూడటానికి వచ్చిన గొల్లలు, బెలూన్లతో పాటు పూలను చిత్రీకరించి తన ప్రతిభను చాటుకున్నారు.**

## పని మనిషులుగా చేరి బంగారం, నగదుతో ఉడాయించిన బీహార్‌కు చెందిన దంపతులు

బుద్వేల్, డిసెంబరు 24 (ప్రభాత ఉదయం): రెండు నెలల క్రితం ఓ డాక్టర్ ఇంట్లో పనికి చేరిన బీహార్ కు చెందిన దంపతులు వారి ఇంట్లో నుంచి 16తులాల బంగారం, రూ.35వేలు దొంగిలించి పారిపోయారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... బండ్లగూడ మ్యాపిల్ టౌన్షిప్ విల్లాలో నివాసం ఉండే డాక్టర్ కొండల్ రెడ్డి ఇంట్లో నవంబరు 1వ తేదీన బీహార్ కు చెందిన య వ దంపుతులు నమిన్ కుమార్ యాదవ్, భారతీ లు పనిలో చేరారు. సోమవారం రాత్రి డాక్టర్ కొండల్ రెడ్డి ఇంట్లో దాచిన 16 తులాల బంగారం, రూ.35వేల నగదు దొంగిలించి దంపతులిద్దరు పారిపోయారు. వారి ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. దీంతో కొండల్ రెడ్డి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న డీఐ విజయ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుణ్ణి హత్య చేసి గోనే సంచీలో మూట కట్టి రోడ్డు పక్కన పడవేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బుద్వేల్, డిసెంబరు24(ప్రభాత ఉదయం): ఓ యువకుణ్ణి హత్య చేసి గోనె సంచీలో మూట కట్టి రోడ్డు పక్కన పడవేశారు. ఉదయం రోడ్డును శుభ్రం చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందికి గోనే సంచీలో నుంచి దుర్వాసన రావడం గమనించి శానిటరీ ఇన్స్పెక్టర్ జగన్మోహన్ కు తెలియజేశారు. ఆయన పోలీసులకు సమాచారం అందచేశారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ లో వెలుగుచూసింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన గల నీరు లేని డ్రైనేజీ కాలువలో ఓ గోనే సంచీలో యువకుణ్ణి మృతదేహాన్ని కట్టి పడవేశారు. మంగళవారం రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి గోనే సం చీలోంచి దుర్వాసన రాగా వారు శానిటరీ ఇన్స్పెక్టర్ జగన్మోన్ కు సమచాచం అందజేశారు. ఆయన వచ్చి చూసి విషయాన్ని మైలార్ దే వుపల్లి పోలీసులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. దీంతో సంఘటనా స్థలానికి మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ నరేందర్ చేరుకుని వివరాలు సేకరించారు. నాలుగు రోజుల క్రితం 30 నుం చి 35 సంవత్సరాల వయస్సు గల యువకుణ్ణి గొంతు నులిమి హత్య చేసి ఇక్కడ పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. నల్లటి పది ఇంచుల జుట్టు, వల్లని గడ్డం, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోసుమారం నిమిత్తం ఉస్మానియ మార్చ్యురీకి తరలించినట్లు తెలిపారు. అతనికి సంబంధించిన వారు ఎవరైన ఉంటే మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలన్నారు.



# జాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆహారోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 24(ప్రభాత ఉదయం)డిసెంబర్ 24: తెలంగాణ ఆహారోత్సవాలో భాగంగా మంగళవారం ధరూర్ మండలం జాంపల్లి ప్రాథమిక పాఠశాల లో విద్యార్థుల చేత ఆహారోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రోజువారీ జీవితం లో మనం తీసుకోవాల్సిన ఆహారాలు పిల్లలు ప్రదర్శించారు. తెలంగాణ రుచుల పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పరుమాల రేవతి, స్థానికులు పాల్గొన్నారు



# కేటిదొడ్డి ఓ ప్రైవేటు పాఠశాలకు నోటీసులు అందజేసిన ఎంఈఓ

కేటిదొడ్డి,డిసెంబర్ 24(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా కేటిదొడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు నోటీసులు అందజేశారు. డిసెంబర్ 30లోగ ప్రభుత్వ నిబంధనలకు మేరకు అనుమతులు తప్పని సరిగా పొందాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్బంగా ఎంఈఓ మాట్లాడుతూ... నూతనంగా ప్రైవేటు పాఠశాల అనుమతి, గుర్తింపు కావలసిన వారు కూడా జిల్లా విద్యాశాఖకు ప్రతిపాదనలు వెంటనే పంపించుకోవాలన్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాలకు నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ అనుమతి , గుర్తింపు తప్పనిసరని తెలిపారు. అనుమతి, గుర్తింపు లేకుండా ఏ పాఠశాల కూడా నడపకూడదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం కేటాయించిన ఫీజులు మాత్రమే విద్యార్థుల నుండి వసూలు చేయాలన్నారు. పాఠశాలలో కనీస వసతులు తప్పని సరిగా కల్పించాలన్నారు.




# కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి

## సూపర్ మ్యాక్స్ కార్మికుల ఆవేదన..

## మీకు అండగా ఉంటా...

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం) జీడిమెట్ల పారిశ్రామికవాడలోని అతి పెద్దదైన సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉండి న్యాయం చేస్తానని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ భరోసా ఇచ్చారు.ఆదివారం గాజులరామారం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్మికులు ఆయనను కలిసి వారు పడుతున్న కష్టాలను బాధతో వివరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ పరిశ్రమలో 1,050 మంది కార్మికులు పని చేస్తారని, గత రెండున్నర సంవత్సరాల నుండి తమకు రావలసిన జీతాలు మరియు బకాయిలను యాజమాన్యం చెల్లించడం లేదని తినడానికి తిండిలేక, పిల్లల చదువుల ఫీజులు కట్టలేక, అనారోగ్యం కారణంగా మందులకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మానసికంగా కృంగిపోయి మనోవేదనతో పదుల సంఖ్యలో కార్మికులు చనిపోయారని వివరించారు. ఇంకా చాలా మంది అనారోగ్యంతో మానసికంగా బాధపడుతున్నారని, సమస్య త్వరగా పరిస్కారం అవ్వని పరిస్థితుల్లో ఇక ఆత్మహత్యలే పరిష్కారమని కన్నీటి పర్యంతం అవుతూ వారి ఆవేదనను వ్యక్తం చేశారు. పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) తీసుకోవాడానికి(విత్ డ్రా) వీలులేక, అంతరాయం వల్ల మరొక పరిశ్రమలో ఉద్యోగం చేరలేకపోవడం వల్ల మా కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని దీనంగా పరిస్థితిని కూన శ్రీశైలం గౌడ్ తో చెప్పుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా తమకు ఎటువంటి న్యాయం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైన తమ కార్మికుల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకున్నారు. దీంతో సహృదయంతో స్పందించిన ఆయన మాట్లాడుతూ త్వరలో కార్మికులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిపించి మీ సమస్యలకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. యాజమాన్యం పై ఒత్తిడి పెంచి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని మనోధైర్యం చెప్పారు. కలిసిన వారిలో కార్మిక సంఘం నాయకులు భరద్వాజ్, రామచంద్ర రెడ్డి, గోపాల్ రెడ్డి, రవి కుమార్, రఘుపతి రెడ్డి, జనార్ధన్, దయాకర్, సూర్యనారాయణ సి.హెచ్.శ్రీనివాస్, గణనాథ్, మమ్మి శ్రీను, శ్రీధర్ గౌడ్, రాజు, కవిత, వీర్ల వెంకటేశ్వర్లు, దస్తగిరి, అక్బర్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

# కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుండి తొలగించాలి

## రాష్ట్ర టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి



కలెక్టర్ కు మెమొరండం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు ..



అంబేద్కర్ విగ్రహం కి పూలమాలవేసిన నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 24(ప్రభాత ఉదయం) ఏఐసీసీ , టిపిసిసి పిలుపు మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా శాసనసభ సభ్యులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, జిల్లా పార్టీ మహిళ నాయకులు, జిల్లా పార్టీ వివిధ విభాగాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... దేశ ప్రజలకు రాజ్యాంగంతో దిక్సూచిని ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాల పేద ప్రజల్లో వెలుగులు నింపిన అంబేద్కర్ పై కేంద్ర మంత్రి పదవిలో ఉన్న అమీత్ షా దళిత వర్గాల మనోభావాలను దెబ్బతీసినందుకు కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించడమే కాకుండా బీజేపి పార్టీ నుండి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుండి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు వీర్ల పల్లి శంకర్ , కసిరెడ్డి నారాయణ రెడ్డి , మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ , రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మల్ రెడ్డి రామ్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , జైపాల్ , మాజీ జడ్పి చైర్మన్ తీగల అనిత రెడ్డి , ఎల్ బి నగర్ పార్టీ నాయకులు రామ్మోహన్ గౌడ్ , మార్కెట్ కమిటీ అధ్యక్షులు చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలశివుడు, ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు సికిందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పిసిసి నాయకులు, పార్టీ జిల్లా ఫ్లోర్ నాయకులు జంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు జిల్లా పార్టీ నాయకులు, మహిళ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా స్పెల్ బీ కాంపిటీషన్ పోటీలు

గద్వాల టౌన్, డిసెంబర్ 24(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని కాతీయ హై స్కూల్లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థులకు స్పెల్ బీ పరీక్షలు నిర్వహించారు. ఈ కాంపిటీషన్ నిర్వహించడం వల్ల విద్యార్థుల యొక్క జ్ఞాపకశక్తి, ఉచ్చరణ, కొత్త పదాల సేకరణ, నేర్చుకోవాలని జిజ్ఞాస వంటి పదాలను ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉపయోగించాలి అని దానిమీద వాళ్లకి అవగాహన పెరుగుతోందని ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఆనందంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి 7వ తరగతి విద్యార్థి నీల్, రెండవ బహుమతి విద్యార్థి సాధించగా విజేతలకు పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి, రాముడు కురువ, ప్రిన్సిపల్ సీమ జేమ్స్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# ప్రతి ఒక్కరు బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలి



గద్వాల జిల్లా ప్రతినిధి , డిసెంబర్ 24(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలాన్ని బాల్య వివాహాలు లేని, బాల కార్మికులు లేని మండలంగా తీర్చిదిద్దడం కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని కేటిదొడ్డి ఎంపీడిఓ కే.కృష్ణమోహన్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేటిదొడ్డి మండల స్థాయి బాలాల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.కృష్ణమోహన్ మాట్లాడుతూ... పిల్లల రక్షణ సంరక్షణ బాధ్యత మన అందరి పై ఉందన్నారు. బాలల హక్కులు బాలల చట్టాల గురించి వాటి యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. జరిగింది. ఈ కార్యక్రమంలో బాలల హక్కులను కాపాడాలని పిల్లలు హక్కులను వారు పొందే విధంగా చూడాలని కోరడం జరిగిందన్నారు. పిల్లల హక్కులను వారు స్వేచ్ఛగా పొందే జీవించే హక్కు ఉందని, కాబట్టి వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి మండల స్థాయి అధికారులపై ఉందని అన్నారు. కేటిదొడ్డి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... 18 సంవత్సరాలలోపు పిల్లలకు భారత రాజ్యాంగంలో కొన్ని హక్కులు, చట్టాలు ఉన్నాయని వాటిని మనమందరం కాపాడాలని, వారి అభివృద్ధి కోసం మనం కృషి చేయాలని కోరారు. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపుల పాల్పడినట్లయితే చట్టం ప్రకారం వారికి కనీసం 7 సంవత్సరాల వరకు జైలుశిక్ష ఉంటుందన్నారు. బడి మానేసిన పిల్లలు ఎవరైనా ఉన్నట్లైతే పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని కోరడం జరిగింది. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా ఆ పని లో పెట్టుకున్నట్లైతే చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం శిక్షిస్తామని అన్నారు. మాట్లాడుతూ... 18 సంవత్సరాలలోపు పిల్లలను ఎవరైనా హింసలకు వేధింపులకు అవుతున్నట్లయితే వారి యొక్క సమస్యలును 1098,100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలియ చేయాలని చెప్పడం జరిగింది. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 24/7 పిల్ల లెక్క రక్షణ కోసం పనిచేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. 1098 కి కాల్ చేసినట్లయితే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ కార్యక్రమంలో తెలియజేయడం జరిగింది. మండల స్థాయి పరిరక్షణ కమిటీ అనంతరం మండల ఎంపీడీవో కృష్ణమోహన్ చేత బాలల హక్కులు, చట్టాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కె.వెంకటేశ్వరి, ఎంవి ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ కిరణ్ , బాలల సంరక్షణ అధికారి జోగు రవి, సూపర్వైజర్ సురేఖ, సోషల్ వర్కర్ పద్మ,చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివ లీల, కౌన్సిలర్ జయన్న, మెడికల్ ఆఫీసర్, ఆర్ఐ దేవేందర్ రెడ్డి, ఏపీఎం గోపాల్ గౌడ్, గ్రామపంచాయతీ సెక్రెటరీ సత్యనారాయణ అంగన్వాడీ టీచర్లు మహాలక్ష్మి , ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు పెద్దలు, కిషోర్ బాలికలు విద్యార్థులు పాల్గొన్నారు.

# నివేదితలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు





కొత్తకోట, డిసెంబర్ 24(ప్రభాత ఉదయం): కొత్తకోట పట్టణ కేంద్రంలోని నివేదిత పాఠశాలలో మంగళవారం ఘనంగా చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలను స్కూల్ అధ్యాపకులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏంజల్స్, మరియమ్మ,శాంటాతాత,వేషధారణలో విద్యార్థుల నృత్యాలు, ఏసు క్రీస్తు నాటికలతో పలువురిని ఆకట్టుకున్నారు. యేసు క్రీస్తు చెప్పిన మాటలను విద్యార్థులకు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఏఓ బాలకృష్ణ,వైస్ ప్రిన్సిపాల్ వీణ, కోఆర్డినేటర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



# మిఠాయి దుకాణాలపై దూసుకెళ్లిన ట్రాక్టర్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 24 (ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలో వెలసిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా భీంనగర్ లో మిఠాయి దుకాణాలతోపాటు పలు రకాల దుకాణాలు వెలిసాయి. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం మిఠాయి దుకాణంపై దూసుకెళ్లడంతో దుకాణంలో నిద్రిస్తున్న సరోజమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. దౌలన్నకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మహిళను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఓ మహిళకు తీవ్రగాయాలు కాగ, మరొకరికి స్వల్పగాయాలు కాగ . గాయపడిన మహిళను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా జిల్లా కేంద్రంలో మట్టిమాఫియా విచ్చల విడిగా మట్టిని తరలిస్తున్నారని, రాత్రి వేళలో ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతుండటంతో పట్టణ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపించారు. జాతర సందర్భంగా మట్టిమాఫీయా వాహనాలు తిరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.